కథ

# నిజం

స్వర్ణ వేణుగోపాల్

"ఈసారెలాగైనా సునంద దగ్గరకెళ్లి రావాలి. మీరు వచ్చేయ్... వచ్చేయ్... అంటూ పాట పాడకండి" సూటుకేసు సర్దుకుంటూ అన్నా మా వారితో.

"ఎవరొద్దన్నారోయ్. నీ ఇష్టం. ఎప్పుడన్నారా.. నాకేం బాధ లేదు... హాయిగా ఉంటా" ఉడికిస్తూ అన్నారు.

"ఆ మాట మీదే ఉండండి... సరేగానీ ఇంతకూ తమరు పెళ్లికి వస్తున్నట్లా..లేనట్లా?

"రాకపోతే మీ అన్న ఊరుకుంటాడా? వాడి తిట్ల పురాణం వినే బదులు పెళ్లికి రావడమే మంచిది. నీ సర్దుడయిందా? లే.. ఆకలేస్తూంది" అన్నారు.

సూటుకేసు మూసి లేచా.

బెంగుళూరులో మా అన్న కొడుకు పెళ్లి.. అదీ.. హడావిడి. పెళ్లి అయ్యాక పిల్లలిద్దరినీ హనీమూన్‌కు పంపించి, నేను సునంద దగ్గర రెండు రోజులుండి వస్తానని అన్నయ్యతో చెప్పి హిందూపురం బయల్దేరా. కారు తీసికెళ్లమని అన్నయ్య పోరినా వద్దని బస్సెక్కా.


హిందూపురం అనగానే నా మనసు ఉత్సాహంతో ఎగిసిపడుతుంది. సంతోషంతో నిండిపోతుంది. మనసు గాల్లో తేలిపోతుంది. ఎప్పుడెప్పుడు ఆ ఊరెళ్లి, ఆ గాలిని గుండెల నిండా నింపుకుందామా అని ఆత్రంగా ఉంటుంది. కారణం నా బాల్యమంతా ఆ ఊరిలో గడవడమే. ఎవరికైనా తిరిగిరాని తీయని జ్ఞాపకం బాల్యం కదా.

నేనూ, సునంద ఇద్దరం ఫస్టు నుండి టెన్త్ వరకు కలిసి చదువుకున్నాం. ఒకే క్లాసు, ఒకే బెంచి. పక్క పక్క ఇళ్లవ్వడంతో స్కూల్లోనే గాకుండా, ఇంట్లోనూ కలిసే ఉండేవాళ్లం. తను మా ఇంట్లోనో, లేక నేను వాళ్ల ఇంట్లోనో ఇద్దరం ఎప్పుడూ కలసి కనిపించేవాళ్లమందరికీ. అందరూ జంట కవులని పేరు పెట్టారు కూడా.

టెన్త్ అయ్యాక, నేను అనంతపురం ఉమెన్స్ కాలేజీలో చేరితే, తనేమో హిందూపురంలోనే చదివింది. హాలీడేస్‌లో ఇద్దరం కలిసి ఊరంతా చుట్టేవాళ్లం.

బస్సులో ఉన్నానన్నమాటే గానీ, నా మనసు వెనక్కి జంప్ చేసి బాల్యంలోకెళ్లిపోయింది. తీయటి జ్ఞాపకాల పేజీలను తిప్పుతున్న మనసు 'స్పిన్నింగు మిల్లు' వచ్చేదాకా వర్తమానంలోకి రాలేకపోయింది. టెన్త్‌లో ఉన్నప్పుడు స్కూల్ తరఫున అందరం మిల్లును చూడ్డానికి వచ్చిన సందర్భం గుర్తుకొచ్చింది.

బస్సు ఆంజనేయస్వామి గుడి దగ్గరకొచ్చింది. మనసులోనే ఆ పవనపుత్రుడికి నమస్కారం చేసుకున్నాను. ప్రతి నెల నాన్న అభిషేకం, ఆకుపూజ చేయించేవారు. ఉదయాన్నే అయిదు గంటలకంతా రెడీ అయిపోయి, అమ్మ వాళ్ల కన్నా ముందుగా చేరాలని, పిల్లలమంతా పరిగెట్టుకుంటూ వచ్చేసేవాళ్లం. రామాలయం దాటి, వేణుగోపాలస్వామి గుడి దాటి, మేము చదివిన స్కూలు దగ్గర బస్సు ఆగింది. ఇక్కడ నుండి సునంద వాళ్ల ఇళ్లు దగ్గరే. అందుకని దిగిపోయాను. పది సంవత్సరాలు చదివిన స్కూలు ఇప్పుడు చాలా మారిపోయింది.



ఫ్రాకుల దశ నుండి ఓణీల వరకు ఇక్కడే.. ఈ మట్టిలో ఎన్ని ఆటలు.. మాటలు.. పాటలు. ఎంత మంచి అనుభూతి ఒళ్లు పులకరించింది. నడుచుకుంటూ వెళ్తే.. ఇలాంటి అనుభూతులెన్నింటినో రుచి చూడచ్చని, ఆటోను వద్దని, నడక మొదలెట్టాను.

వేణుగోపాలస్వామి గుడి... స్కూల్ ఎగ్గొట్టి.. నేనూ, సునందా ఇంకా కొందరు ఈ గుడిలో పూజారి పెట్టిన ప్రసాదం తిని, ఆడిన ఆటలు, స్కూల్ ఎగ్గొట్టినందుకు పెద్దలతో తిన్న చివాట్లు, దెబ్బలు... ఇప్పుడే జరిగినట్లుగా ఉంది.

నిజంగా.. కాలం మళ్లీ వెనక్కి వెళ్తే ఎంత బాగుం

టుంది. పుస్తకాల సంచి తగిలించుకుని పరుగు పరుగున బడికెళ్లిన రోజులు.. కాస్త పెద్దయ్యాక పుస్తకాల బొత్తి గుండెల కానించి పట్టుకుని, అందరూ నన్నే గమనిస్తున్నారనే ఫీలింగుతో, ఒకలాంటి తడబాటుతో, వయ్యారపు నడకలు నడిచిన రోజుల్లో నడిచిన రోడ్డుపై.. నేడు నా పాదాలు ఆనాటి స్పర్శను అనుభవిస్తున్నాయి.



దూరంగా సునంద వాళ్లిల్లు కనబడుతూంది. ఏ మార్పూ లేక ఇల్లు అలాగే ఉంది. కొత్తగా రంగులు వేశారేమో మెరుస్తూంది. పక్కనే మేమున్న ఇల్లు.. పడగొట్టి మేడ కట్టారు. కాస్త నిరాశ పడ్డాను. అమ్మ, నాన్నలతో అక్క, అన్నలతో ఆడి, పాడి, ఏడ్చి, ఏడ్పించి తన్నులు తిని పెరిగిన ఇంట్లో ఒకసారి కలయతిరుగుదామన్న నా ఆశను ఆ మేడ అడియాస చేసింది.

'సునంద ఉందో...లేదో...' తీరా దగ్గరకొచ్చాక సందేహం.

గేటు తీసి లోపలికడుగు పెడుతుండగా వినిపించిన మాటలకు ఆగిపోయా.

"ఇదిగోమ్మా.. నిన్నటితో నువ్వొచ్చి ఆరు నెలలయ్యింది. రేపు టికెట్టు బుక్ చేసేస్తున్నానంతే..."

"అదికాదురా.. వాడేదో టూరు వెళ్తున్నా వచ్చాక రమ్మన్నాడు కదరా" సునంద గొంతు.

"నాకదేం తెలీదమ్మా.. పోయినసారి కూడా ఇలాగే ఏదో సాకు చెప్పి నెల రోజులు దాటేశాడు"

"వాళ్లు కావాలనే చేస్తున్నారండీ. ఈసారి కూడా నెల రోజుల దాకా రారు చూస్తుండండి" కోడలు కాబోలు.

"అయినా.. ఒప్పందం చేసుకున్నాక ఆ మాట మీద నిలబడాలి. వాడు టూరు వెళ్తే నువ్వెళ్లి వాళ్ల గుమ్మం ముందు కూర్చో వాళ్లొచ్చేదాకా - అప్పటిగ్గానీ తెలిసిరాదు వాళ్లకు" కోపంగా అన్నాడు.

ఇంకా నిల్చుని వినడం బాగుండదని.. "సునందా" అని పిలుస్తూ గుమ్మం దగ్గరకెళ్లా.

"ఎవరూ" అంటూ కళ్లల్లో ఏదో పడ్డట్లుగా తుడుచుకుంటూ బయటికొచ్చిన సునంద నన్ను చూసి "మీనా" అంటూ గట్టిగా వాటేసుకుంది.

దాని కళ్లు ఇక నీళ్లని దాచుకోలేనంటూ జలజలా రాల్చాయి. "చూశావా నువ్వొచ్చిన సంతోషంలో నా కళ్లు చమరుస్తున్నాయి" రాని నవ్వును తెచ్చుకుంటూ తన దుఃఖాన్ని కప్పిపుచ్చుకుంటూ నన్ను పొదివి పట్టుకుని లోపలకి తీసుకెళ్లింది.

"రాజూ.. చూదరా.. ఎవరొచ్చారో?"

అప్పటికే సునంద చిన్నకొడుకు రాజు, కోడలు మహతి, మనవడు హాల్లో నిల్చున్నారు.

నన్ను చూసి "రండి పెద్దమ్మా.. బాగున్నారా? నమస్కారం అత్తయ్యగారూ" అంటూ ఇద్దరూ వంగి నా కాళ్లకు దండం పెట్టారు. కొడుకుతో కూడా పెట్టించారు.

నేను తీసికెళ్లిన బట్టలు, స్వీట్లు మహతి చేతిలో పెట్టా. సంతోషంగా తీసుకుని లోపలికెళ్లి కాఫీ కప్పుతో వచ్చింది. నేను ఇల్లంతా తిరిగి చూశా. ఏ మార్పూ లేదు. పెరట్లో వేప, జామ, కొబ్బరి చెట్లను పలుకరించా. వేప చెట్టుకు ఊయల కట్టి ఊగేవాళ్లం. జామ చెట్టెక్కి పచ్చికాయలే తెంపి కొరికి కొరికి విసిరేసే వాళ్లం.

అమ్మ బాబా భక్తురాలవ్వడంతో, అస్తమానం పుట్టపర్తి వెళ్లిపోయే వారు. దాంతో నేను సునంద వాళ్లమ్మ చేతి ముద్ద తిని, ఈ ఇంట్లోనే ఎక్కువగా గడిపేదాన్ని. మా ఇంటితో ఎంత అనుబంధముందో ఈ ఇంటితోనూ అంతే ఉంది.

మా అల్లరికీ, అరుపులకూ, కేకలకూ, కేరింతలకూ, ఏడ్పులకూ, నవ్వులకూ, చిన్నప్పటి మా అనుభూతులన్నింటికీ నిలువెత్తు సాక్ష్యంగా నిలుచున్న గోడలను తడిమి తడిమి చూశా.

ఎన్ని దేశాలు తిరిగి చూసినా, ఎన్ని కొత్త ప్రదేశాలకు వెళ్లినా మనసు ఇంతలా స్పందించదనిపించింది.

నాకిష్టమని బిసిబెళె బాత్ చేసింది సునంద. చిన్నప్పుడు నాలుగయిదు కుటుంబాలు కలిసి, విదురాశత్వం, గుడ్డం, ఘాటీ, లేపాక్షి అని ఇక్కడకి దగ్గరలలో ఉన్న ప్రదేశాలకు పిక్నిక్‌లా వెళ్లేవాళ్లం. అప్పుడు ఈ బిసిబెళె బాత్ చేసి పిల్లలందరి చేతిలో పెద్ద పెద్ద ముద్దలు పెట్టి తినమనేవారు. ఆ తర్వాత ఎన్నిసార్లు తిన్నా ఆ రుచి రాలేదు.

సాయంత్రం ఇద్దరం నడుచుకుంటూ ఆనాటి జ్ఞాపకాలను తిరగేసుకుంటూ కన్యకాపరమేశ్వరి ఆలయానికి చేరాం. అమ్మవారి పాలరాతి విగ్రహం కనులకింపుగా, సౌందర్యానికి ప్రతీకగా ఉంది. దర్శనం చేసుకుని కూర్చున్నాక అడిగా సునందను "ఇప్పుడు చెప్పు సునందా.. ఎలా ఉన్నావు?"

"నాకేం మీనా.. బానే ఉన్నాను. లేకపోతే.. ఆయన లేని లోటు బాగా తెలుస్తోందీమధ్య. పిల్లలు వాళ్ల సంసారంలో పడ్డారుగా. అందుకేనేమో లోన్లీగా ఫీలవుతున్నా"

తన కళ్లలో సన్నటి నీటి తెర.

నా గుండె పిండినట్లయింది.

## తెలివైన కాజల్

తెలుగులో ప్రస్తుతం తన పొజిషన్‌కి తెగ సంబరపడుతున్న కాజల్ అగర్వాల్ హిందీలో ప్రయత్నాల గురించి చెబుతూ- 'నాకు బాలీవుడ్‌కెళ్లాలని ఆరాటం ఏదీ లేదిప్పుడు. ఎంచక్కా తెలుగులో నాకు మంచి ఆదరణ వుంది. ఇక్కడే నా కెరీర్ మరింత ముందుకు సాగాలని ఆశిస్తున్నాను' అంటోంది కాజల్. అవును మరి, ఇక్కడ టాప్ రాంక్‌కి వెళ్లాక వద్దన్నా హిందీ నుంచి ఆహ్వానాలు వస్తాయని గతంలో కొంతమంది హీరోయిన్లు నిరూపించారు కదా! బహుశా కాజల్ ఆలోచన కూడా అదేనేమో!

"నేను వచ్చినప్పుడు నీవు, రాజు ఏదో గొడవపడుతున్నట్టున్నారు" మెల్లగా అడిగా.

"అదేం పెద్ద విషయం కాదులే మీనా...నేను ఆర్నెల్లిక్కడ, ఆర్నెల్లు అక్కడ ఉంటాను కదా? వాడేమో ఊరు వెళ్తున్నా వచ్చాక అమ్మను తీసుకెళ్తానన్నాడు. పోయిన సారి కూడా ఇలాగే చేశాడు. కావాలనే చేస్తున్నాడని వాడి బాధ అంతే.. రెండ్రోజులు పోతే వాడే సర్దుకుంటాడు" తేలికగా తీసుకున్నట్టు చెప్పినా దాని గొంతులో దుఃఖం దాచలేకపోయింది.

నేనూ దాన్ని పొడిగించకుండా మరొక్కసారి అమ్మవారికి దండం పెట్టుకుని ఇంటికి వచ్చేశాం.

సునంద ఇద్దరు కొడుకుల మధ్య ఫుట్‌బాల్‌లా తిరుగుతూ వాళ్ల దయాదాక్షిణ్యాల మధ్య బ్రతుకీడుస్తోందనుకుంటేనే మనసంతా బాధతో నిండిపోయింది. ఆయన దాన్ని ఎంతో అపురూపంగా చూసేవారు. ఇప్పుడిలా బాధపడ్తోంది. నా మనసు విలవిలలాడుతోంది. ఏం చేయాలి?

రాత్రి భోజనాలయ్యాక డాబా మీద చేరాం. మళ్లీ పాత రోజుల జ్ఞాపకాలు. అప్పుడు వరుసగా పరుపులు పరిచి, తెల్లటి చలువ దుప్పట్లు పరిచేవాళ్లు అమ్మావాళ్లు. వాటిపై దూకి, పొర్లి పొర్లి ఆడుకుంటూ, ఆకాశంలో నక్షత్రాల్ని లెక్క పెడుతూ నిద్రపోయే వాళ్లం.

"అబ్బ! ఎంత హాయిగా ఉంది సునందా! మళ్లీ ఆ రోజులు గుర్తొస్తున్నాయి" అన్నాను మంచంపై వాలుతూ.

"ఆ రోజులు మళ్లీ వస్తే ఎంత బాగుండు మీనా. ఎంత ఆనందంగా గడిపాము. ఎంత స్వేచ్ఛగా, ఏ భేషజాలూ లేకుండా అందరం కలిసి ఉండేవాళ్లం. ఇప్పుడు చూడు ఈ పక్కింట్లో ఎవరున్నారో, ఎంతమందున్నారో కూడా సరిగ్గా తెలీదు. ఇప్పుడు మనకు సంపాదన ఎక్కువయి, సౌకర్యాలున్నాయి గానీ, అనుబంధాలు, అనురాగాలూ, ఆప్యాయతలు అడుగంటిపోయాయి మీనా. అన్నింటినీ డబ్బుతో కొలుస్తున్నారు- నేనూ, నా ఇల్లూ, పిల్లలూ అన్న స్వార్థం పెరిగింది మనిషిలో"

"స్వార్థం అంటే గుర్తొచ్చింది సునందా! రాజుకు తన పుట్టుక గురించి తెలుసా?"

"ఛ..ఛ.. తెలీదు.. అయినా నేను తెలియనిస్తానా? రవితో సమానంగా వీడిని పెంచాం. ఏనాడూ విడిగా చూడలేదు. ఒక రకంగా వీడినే బాగా చూశామని చెప్పొచ్చు. ఎవరు కన్నబిడ్డో మనం తీసుకొచ్చాం. వాడికెందులోనూ లోటుండరాదని, కొన్ని విషయాల్లో రవిని పక్కన పెట్టి వీడికే ప్రాధాన్యమిచ్చాం. చదువులో కూడా. రవి ఇంజనీరు కావాలనుకున్నాడు. ఇద్దరినీ చదివించలేక రవిని బి.ఇడితో సరిపెట్టి వీడిని మాత్రం ఇంజినీరును చేశాం. ఏదేమైనా మేము న్యాయమే చేశామనిపిస్తుంది మీనా"



"ఇంత చేసినా నీ ఇంట్లో నుండి నిన్నే పొమ్మంటున్నాడు చూశావా. వాడెవరన్నది తెలిస్తే ఇలా ప్రవర్తించడేమో సునందా. నన్ను చెప్పమంటావా?" అడిగా.

"వద్దొద్దు.. వాడికిప్పుడు తెలిస్తే చాలా బాధపడతాడు. వాడెప్పుడూ సంతోషంగా ఉండాలి మీనా.. అదే నా కోరిక"

"అదికాదు సునందా నీ సంతోషం కూడా చూసుకోవాలిగా"

"ఒక బిడ్డతో సరిపెట్టుకుని, అనాథను ఒకరిని పెంచుకుని తద్వారా ఒక్కరికైనా మంచి జీవితాన్నందివ్వాలన్న ఆయన గొప్ప మనసుకు నిదర్శనమే వీడు... రాజు. ఇదంతా వాడికి చెప్పి, నేను పొందేది నిజమైన సంతోషమవుతుందా చెప్పు? అలా చెబితే అది స్వార్థమవ్వదా? ముఖ్యంగా ఆయన ఆశయం దెబ్బతింటుంది కదా! అది నాకేమాత్రం ఇష్టం లేదు మీనా. పోతే నాకు ఆడపిల్లను పెంచుకోవాలనుండేది. కానీ ట్రైనులో వాడినెవరో వదిలేసి వెళ్లిపోతే చూస్తూ.. చూస్తూ మేమూ వదల్లేక తీసుకొచ్చి పెంచాం. కనీసం మనమరాలైనా పుడుతుందేమోననుకుంటే ఇద్దరికీ మగపిల్లలే. ఆ కోరిక ఉండిపోయింది మీనా. అయినా ఇవన్నీ నీకు తెలియని విషయాలా ఏం? పడుకో పొద్దుపోయింది" అంటూ నిద్రలోకి జారుకుంది.

మరుసటి రోజు నేను బెంగుళూరు బయల్దేరాను. బస్సు ఎక్కాక "పెద్దమ్మా.. ఇవి తీసుకోండంటూ" రెండు మేగజైన్లు, వాటర్ బాటిల్ నా చేతిలో పెట్టాడు రాజు.

"రాజూ.. అమ్మను జాగ్రత్తగా చూసుకో" కళ్ల నీళ్లు తిరుగుతుండగా చెప్పా.

"అలాగే.. పెద్దమ్మా" అన్నాడు వాడు.


సునంద కళ్లల్లో.. నీళ్లు.


'గౌరీ బిదనూరు' దాటాక కాస్త తెప్పరిల్లి రాజు ఇచ్చిన మేగజైను తెరవగానే ఒక కవరు కనిపించింది. విప్పి చూశాను. రాజు రాసిన ఉత్తరం.. చదివా..

"పెద్దమ్మా,

## సినిమాలు చూస్తా

ఛార్మికి ఈమధ్య సినిమాలు బాగానే తగ్గాయి. 'మాయగాడు', 'సై ఆట'- ఈ రెండు సినిమాలు విడుదలకు ముస్తాబవుతున్నాయి. వీటిపై ఛార్మికి ఎన్నో ఆశలున్నాయి. ఖాళీగా వున్నప్పుడు అక్కడికీ ఇక్కడికీ వెళ్లి కాలక్షేపం చేయడం లాంటివి ఛార్మికి సుతరామూ నచ్చదుట. ఏమాత్రం ఖాళీ దొరికినా ఎంచక్కా ఇంట్లో కూర్చుని సినిమాలు చూడ్డం అంటే ఇష్టం అంటుంది. పైగా తనకి హైదరాబాదంటే కూడా ఎంతో అభిమానమట. అందుకనే హాయిగా ఇక్కడే వుండి టీవీలో మూవీస్ చూడ్డం అంత ఉత్తమమైనది మరొకటి లేదంటుంది.




మీరు ఇంట్లో అడుగు పెడుతుండగా అమ్మతో నేనన్న మాటలకు నన్ను క్షమించండి. నిన్న రాత్రి మీరు, అమ్మ మాట్లాడుకున్న మాటలన్నీ విన్నాను. అనాథగా బ్రతకాల్సిన నన్ను అక్కున చేర్చుకొని కన్నబిడ్డ కన్నా ఎక్కువగా చూసుకున్న ఈ మానవతామూర్తులకు ఏమిచ్చి ఋణం తీర్చుకోను? అసలా ఋణం తీరేదేనా? ఇన్ని రోజులు అమ్మను చూసుకోవడంలో వంతులు వేసుకుని పెద్ద పాపం చేశాను. నాన్న ఆత్మ కూడా ఎంత క్షోభించిందో. ఏనాడూ నేను పరాయివాడినన్న అనుమానం ఏమాత్రం రాకుండా నన్ను కళ్లల్లో పెట్టుకుని చూసుకున్న అమృతమూర్తి అమ్మకు ఇక ఎన్నటికీ కంట తడి కాకుండా చూసుకుంటా పెద్దమ్మా. రవి ఆర్థికంగా నాకన్నా వెనగ్గానే ఉన్నాడు. తనకూ అన్ని విధాలా నేను అండగా ఉంటాను. నేనూ ఒక అనాథ ఆడపిల్లను పెంచుకుని, అమ్మ కోరిక తీరుస్తాను. ఇక మీ స్నేహితురాలి గురించి మీరేమాత్రం బెంగపడకండి. మీరు వచ్చి నా కళ్లు తెరిపించినందుకు చాలా చాలా.. థాంక్సు. మళ్లీ మీరు వచ్చి మీ స్నేహితురాలి సంతోషాన్ని చూడాలి. తప్పకుండా రండి.

కృతజ్ఞతలతో

-రాజు"

వాడి పుట్టుక గురించి తెలియజేయాలనే ఉద్దేశంతోనే రాత్రి వాడిని దాబా మీదకు రమ్మని, వాడు వచ్చే టైముకు సునందతో వాడి గురించి అన్ని విషయాలూ చెప్పించానన్న సంగతి నాకు మాత్రమే తెలుసు. నిజం వాడికి తెలియకూడదనుకుంది సునంద. ఏదేమైనా సునంద సంతోషమే నాకు ముఖ్యం. అది నెరవేరింది. అంతే చాలు.. స్నేహితురాలికి న్యాయం చేశానన్న తృప్తితో నా మనసు నిండిపోయింది.

## తీరిన కోరిక

బాయ్‌ఫ్రెండ్ రాజ్‌కుంద్రాతో కలిసి 'ఐపిఎల్ బిజినెస్‌లోకి అడుగుపెట్టిన శిల్పాశెట్టి ఇప్పుడు బ్యూటీ పార్లర్‌ల చెయిన్ ఆరంభిస్తోంది. ఎప్పటినుంచో తనకి బ్యూటీ పార్లర్ లాంటిది నడిపించాలని కోరికగా వుండేదిట. దాన్ని ఇప్పటికి నెరవేర్చుకున్నానంటోంది. ఇటీవలే ముంబాయిలో తొలి 'స్పా'ని మొదలెట్టిన శిల్పాశెట్టి క్రమంగా దేశవ్యాప్తంగా వీటిని తెరుస్తానంటోంది. తను సినిమా తారగా అందాన్ని ఎలా ఇనుమడింపచేసుకోవాలో గ్రహించాననీ, దీంతో అనేక మెళకువల్ని రంగరించి ఈ 'లాసిన్' స్పాని ఏర్పాటు చేస్తున్నట్టు చెబుతోందీ పొడుగుకాళ్ల సుందరి.

